
### తప్పించుకునేందుకేనా..?

రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ఈ నెల 20 వరకు మండల స్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి జిల్లా కమిటీలకు సిఫారసు చేస్తారు. ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లా స్థాయిలో పరిశీలించి మంజూరు పత్రాలు జారీ చేయాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు రుణాలు పంపిణీ ప్రారంభించి 9 వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, సిబిల్ స్కోర్ ప్రాతిపదికన ఎంపిక చేస్తే మాత్రం ఈ పథకాలకు ఎవరూ ఎంపికయ్యే పరిస్థితి ఉండదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. నిజానికి ₹50 వేల వరకు పూర్తి సబ్సిడీపై రుణం ఇస్తున్నారు. ₹1,00,001 వరకు 80 శాతం, ₹2,00,001 నుంచి ₹4 లక్షల వరకు 70 శాతం వరకు రుణాలు ఇస్తున్నారు. అంటే బ్యాంకులు ఇచ్చేదాని కంటే ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడే ఎక్కువగా ఉంది. కానీ, లబ్ధిదారులను బ్యాంకులు నమ్మాల్సిన అవసరం కనిపిస్తున్నది. అందుకే సిబిల్ స్కోర్ నిబంధన ప్రవేశ పెట్టినట్టు తెలుస్తున్నది. సిబిల్ చూడాలంటే ఒక్కో లబ్ధిదారుడు ₹100 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వస్తుందో లేదో తెలియని రుణానికి ఇప్పటికే ₹వందల్లో ఖర్చు చేశామని, ఇది మరో ఖర్చని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 10 శాతం దరఖాస్తు దారులకు కూడా రుణాలు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం ఈ సిబిల్ నిబంధనను తెరపైకి తెచ్చిందనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.



# ఇయ్యలేక.. కొర్రీలు!

## పథకాల అమలులో సర్కారు మెలిక

అసెంబ్లీ ఎన్నికల వేళ అడ్డగోలు హామీలు గుప్పించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలులో ఆంక్షలు పెడుతున్నది. గతంలో ఏ ప్రభుత్వం పెట్టని విధంగా మెజార్టీ పథకాల్లో కొర్రీలు పెట్టి, కోత విధిస్తున్నది. రాజీవ్ యువ వికాసం నుంచి రైతుభరోసా వరకు అన్నింటికీ 'రూల్స్ అప్లయ్' అంటూ కఠిన నిబంధనలు తెస్తుండడంతో ఎవరికీ వర్తించని పరిస్థితి కనిపిస్తున్నది. కొద్ది మందికే పథకాలు అమలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకునే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుండగా, మెలికలతో వేలాది మంది దరఖాస్తులుదారులు నిరాశకు లోనవుతున్నారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, చివరికి రేషన్ కార్డులు పొందాలన్నా నిబంధనలు కఠినంగా ఉన్నాయంటూ ఆందోళన చెందుతున్నారు.

- చేతులు దులుపుకొనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం?
- సిబిల్ స్కోర్ ఉంటేనే రాజీవ్ యువ వికాసం
- 600 చదరపు గజాలు దాటితే 'ఇల్లు' కట్
- గుంట భూమి ఉన్నా ఇందిరమ్మ భరోసా నుంచి ఔట్
- రైతు భరోసాపైనా ఆంక్షలు
- నాలుగెకరాల పైన ఉన్నవారికి అందని పెట్టుబడి సాయం
- ఆందోళనలో లబ్ధిదారులు

కరీంనగర్, మే 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాలకు నిబంధనల పేరిట అడ్డగోలు కొర్రీలు పెట్టింది. మెజార్టీ పథకాలకు ఏదో ఒక మెలిక కనిపిస్తున్నది. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తామని చెప్పి రాజీవ్ యువ వికాసం పేరిట అమలు చేస్తున్న పథకంలో కఠిన నిబంధలు పెట్టింది. ₹50 వేల నుంచి ₹4 లక్షల వరకు సబ్సిడీపై రుణాలు ఇస్తామని చెబితే వేల సంఖ్యలో జనం దరఖాస్తు చేసుకున్నారు. అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్‌ల కోసం ₹వందల్లో ఖర్చు చేశారు. తీరా సిబిల్ స్కోర్ ఉన్న వారికే రుణాలు ఇస్తామని కొత్త మెలిక పెట్టడంతో కంగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రుణాలు తీసుకున్న వారు, రుణాలు తీసుకొని చెల్లించని వారు అనర్హులని కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా గతంలో రుణాలు తీసుకున్న వారిని మినహాయిస్తే నిజానికి తప్పేమీ లేదు. కానీ, సిబిల్ స్కోర్ ఉంటేనే రుణాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం మాత్రం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు చేస్తున్నది. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని, సక్రమంగా చెల్లించే వారికి మాత్రమే సిబిల్ స్కోర్ బాగుంటుంది. కానీ, రుణాలు తీసుకోని వారి పరిస్థితి ఏంటనేది ప్రభుత్వం ఆలోచించడం లేదు. వివిధ కార్పొరేషన్ల ద్వారా కరీంనగర్ జిల్లాలో ఈ పథకం కింద 57,763 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. మండల స్థాయిలో దరఖాస్తు పరిశీలన ప్రక్రియ కొనసాగుతుండగా, వచ్చే నెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. కానీ, వచ్చిన దరఖాస్తుల్లో చాలా మంది నిరుపేదలే ఉన్నారు. వీరికి బ్యాంకులతో ఎలాంటి సంబంధాలూ లేవు. అయితే, లేని సిబిల్ స్కోర్ ఎక్కడి నుంచి వస్తుందని ఆశావహులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ పథకం కింద బ్యాంకులు ఇచ్చేది నామమాత్రమే అయినా, సిబిల్‌తో లింక్ పెట్టడం ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 10 శాతం మందికి కూడా రుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదు.

### గ్యారెంటీల్లోనూ మెలిక

ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తున్న కొన్ని పథకాల్లోనూ ప్రభుత్వం ఇవే కొర్రీలు పెట్టింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధానమైన హామీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇంటికి కూడా మెలిక పెట్టింది. గత జనవరి 26న లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేసిన ప్రభుత్వం మండలానికో గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేసింది. ఆ గ్రామాల్లో అందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని భావించిన దరఖాస్తు దారులకు నిరాశే మిగిలింది. ఇందిరమ్మ కమిటీలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఎంపిక చేసిన వారే లబ్ధిదారులయ్యారు. ఈ రకంగా దరఖాస్తు చేసుకున్న కొందరిపై వేటు పడగా మిగిలిన వారు ఇండ్లు నిర్మించుకునే క్రమంలో పెట్టిన నిబంధనల మేరకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇండ్లు మంజూరు ప్రొసీడింగులలో ఎక్కడా కొలతలు మెన్షన్ చేయక పోవడంతో లబ్ధిదారులు తమకు తోచిన విధంగా మార్కౌట్ చేసుకుని బేసిమెంట్లు నిర్మించుకున్నారు. తీరా 400 చదరపు గజాల నుంచి 600 చదరపు గజాలు మాత్రమే ఉంటే గానీ, బిల్లులు చెల్లించేదిలేదని కొర్రీలు పెట్టింది. దీంతో కొలతకు మించి ఇండ్లు కట్టుకున్న పదుల సంఖ్యలో లబ్ధిదారులు కంగుతిన్నారు. కట్టిన బేసిమెంట్లు కూల్చలేక, నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన ఇండ్లు ఉన్న కొందరు పక్కన ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించినా అధికారులు ఒప్పుకోవడం లేదు. ఉన్న ఇంటిని కూల్చి కొత్తగా కడితేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారుల ముఖం మీదనే చెప్పేస్తున్నారు. ఇలాంటి కఠిన నిబంధనలతో వారు విసిగిపోతున్నారు.

### ఆత్మీయ భరోసా కరువే!

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట తెచ్చిన మరో పథకంలోనూ ఇదే పరిస్థితి. వ్యవసాయ కూలీలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ₹6 వేల చొప్పున ఏడాదికి ₹12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, వీరికి ఉపాధిహామీ కార్డు ఉండి ఏడాదికి 20 రోజులు పని చేసి ఉండాలని నిబంధన పెట్టింది. అంతే కాకుండా, దరఖాస్తుదారుల పేరిటగాని వారి కుటుంబ సభ్యుల పేరిటగాని గుంట భూమి కూడా ఉండ కూడదని మరో మెలిక పెట్టింది. దీంతో ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఉన్నప్పటికీ వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో ఉన్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తున్నది. ఉపాధి హామీ జాబ్ కార్డు, ఆధార్ కార్డులో లింకప్ అయిన బ్యాంక్ ఖాతా ఉంటేనే ఇప్పుడు ఇందిరమ్మ భరోసాకు ఎంపిక చేస్తున్నారు. ఒక్కో పైలెట్ గ్రామంలో సగటున పదికి తక్కువ మందే ఈ పథకానికి ఎంపికయ్యారు. రేషన్ కార్డు కోసం కూడా భూమితో లింక్ పెట్టారు. ఇక సాగు చేస్తున్న రైతులకే రైతు భరోసా అన్న ప్రభుత్వం.. సాగు చేస్తున్న వందలాది మంది రైతులను ఈ పథకానికి దూరం చేసింది. ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా వర్తిస్తుందనేది ఇప్పటి వరకు ప్రకటించని సర్కారు ఇప్పటి వరకు నాలుగెకరాల లోపు ఉన్న రైతుల వరకే ఈ పథకాన్ని అమలు చేసింది. అధికారంలోకి రాక ముందు ప్రతి సీజన్‌కు ₹7,500 చొప్పున ఏటా ₹15 వేలు ఇస్తామని చెప్పి ₹12 వేలతో సరిపెట్టింది. ఇలా ప్రతి పథకంలోనూ కొర్రీలు పెట్టి అనేక మంది నిరుపేదలను సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నది.



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

## రాజన్న ఆలయ అభివృద్ధిపై
# గోప్యత ఎందుకు?

- నివేదికలను బహిర్గతం చేయాలి
- ఆలయాన్ని మూసివేయాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలి
- పనులు కొనసాగిస్తూనే భక్తులకు దర్శనం కల్పించాలి
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, మే 8: రాజన్న ఆలయ అభివృద్ధి పనుల నివేదికలలో అంత రహస్యం ఏమి ఉందని, ఎందుకంత గోప్యత పాటిస్తున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. వచ్చే జూన్ 15 నుంచి ఆలయాన్ని మూసివేసి అభివృద్ధి చేస్తామని అధికారులు ప్రకటించడం భక్తుల మనోభావాలను కించపరిచినట్లేనన్నారు. పనులు కొనసాగిస్తూనే దర్శనాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. గురువారం వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధిని పూర్తిగా స్వాగతిస్తున్నామని, కానీ పనుల నివేదికలు విడుదల చేయకుండా, కనీసం వేములవాడ పట్టణ ప్రజలు, భక్తులు, ఆఖరికి ఆలయ ఉద్యోగులకు కనపడకుండా ఎందుకు సీక్రెట్‌గా ఉంచుతున్నారో ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చెప్పాలని ప్రశ్నించారు. నివేదికలు బహిర్గతం చేయాలన్నారు. డీపీఆర్ సిద్ధం చేశారా..? ఎన్ని నిధులు అవసరమో అంచనా వేశారా..? అని ప్రశ్నించిన ఆయన, పనులను ఎప్పటివరకు పూర్తి చేస్తారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. 1979లో ఆలయ పునర్నిర్మాణం జరిగిందని, ఆ తర్వాత బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయని గుర్తు చేశారు. అప్పుడు తాము చేపట్టబోయే పనులు ప్రజలు, భక్తులకు తెలిసేలా ఆలయంలోనే ఛాయాచిత్రాలను ఏర్పాటు చేసిన విషయాన్ని చెప్పారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఆలయ అభివృద్ధి విషయంలో గోప్యత ఎందుకు పాటిస్తున్నదో అంతు చిక్కడం లేదన్నారు. ఆలయాన్ని బంద్ చేస్తే, గుడిమీదే ఆధారపడి బతుకుతున్న దాదాపు 5 వేల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు, భక్తులు, చిరువ్యాపారులకు ఇబ్బంది కలిగితే ఊరుకునేది లేదని, ప్రజల పక్షాన నిలుచుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేవని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల కుండబద్దలు కొట్టినట్టు చెప్పారని, మరి నిధులు లేకుండా ఆలయాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. సీఎం నవంబర్‌లో ఆలయానికి వచ్చి ₹76 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, దాదాపు ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కేటాయించలేదని, డబ్బులు రాక ముందే ఇంత హంగామా ఎందుకని మండిపడ్డారు. ఆలయంలోని నగదు ఫిక్స్ డిపాజిట్లు తీసి అభివృద్ధికి వెచ్చించాలనే ప్రతిపాదన సిద్ధం చేస్తున్నట్టుగా తెలిసిందని, అదే జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆలయానికి సంబంధించి ₹110 కోట్ల ఫిక్స్ డిపాజిట్లు ఉన్నాయని, వాటి ద్వారా వచ్చే వడ్డీతోనే రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు, ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయని వివరించారు. జనరల్ ఫిక్స్డ్ డిపాజిట్లు ₹20 కోట్లు, మరో ₹20 కోట్లు నిత్యాన్నదాన సత్రం నిర్వహణకు ఉన్నాయని చెప్పారు. జనరల్ ఫిక్స్ డిపాజిట్లు మినహా ఇతర నగదు డిపాజిట్లు ఏవి కూడా నిబంధనలకు విరుద్ధంగా తీయరాదని వివరించారు. ₹6.5కోట్లతో చేపట్టిన బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నదని, ముందుగా ఈ పనులు పూర్తిచేసిన తర్వాత రాజన్న ఆలయ అభివృద్ధికి పోతే మంచిదని సూచించారు. వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలోను 243 ఇండ్లను భూ సేకరణ ద్వారా సేకరిస్తున్నట్టు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం 315 ఇండ్లను చేర్చడం సరికాదన్నారు. అధికారం ఉంది కదా..! అని ఏకపక్షంగా వ్యవహరిస్తే ప్రజలు క్షమించరన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి రామ్‌చందర్, గోలి మహేశ్, జోగిని శంకర్, సీనియర్ నాయకులు ప్రసాద్ రావు, నరాల దేవేందర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మల్లేశం, అంజద్ పాషా, వాసాల శ్రీనివాస్, గుడిసె సదానందం, వెంకట్ రెడ్డి, పోతు అనిల్ కుమార్, చేపూరి రవీందర్, పైడి శ్రీనివాస్, సుంకపాక రాజు, రవిచంద్ర గౌడ్, కట్ట తిరుపతి, సందీప్, హింగే కుమార్, అసద్, రాకేశ్, అనిల్, ప్రమోద్ ఉన్నారు.

# బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలు

ప్రకటన విడుదల చేసిన డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 8 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షల నిర్వహణ సాధ్యమని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్య నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల అనేక డిగ్రీ కళాశాలలు అచేతన స్థితిలో ఉంటూ సుమారు 50 శాతానికి పైగా మూత పడ్డాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రభుత్వ విధానాల ద్వారా విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, యాజమాన్యాలపై మృత్యుగంటికలు మోగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో యాజమాన్యాలు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించినప్పుడే పరీక్షలను నిర్వహించగలమని, ప్రభుత్వంలోని అన్ని శాఖలకు లేఖలు పంపినప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని చెప్పారు. కానీ, 14వ తేదీ నుంచి పరీక్షలు అని యూనివర్సిటీలు ఇచ్చిన షెడ్యూలు సాధ్యం కాదని, ప్రభుత్వం ఈ రెండు, మూడు రోజులలో స్పందించి కళాశాలల అకౌంట్లో బకాయిలు జమ చేస్తే పరీక్షల నిర్వహణ ఉంటుందని తేల్చిచెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## జీకే యూత్ రక్తదానం

కరీంనగర్‌లో రక్తదానం చేస్తున్న జీకే యూత్ సభ్యులు



కరీంనగర్ కార్పొరేషన్, మే 8 : కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ జన్మదిన వేడుకల సందర్భంగా జీకే యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ చర్యకు సంఘీభావంగా తన జన్మదిన వేడుకలను సాదాసీదాగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఇచ్చిన పిలుపు మేరకు జీకే యూత్ సభ్యులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజుతో పాటు వంద మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. శిబిరంలో ఈ కార్యక్రమంలో సభ్యులు మొగిలోజు వెంకట్, సాయి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



కలింపేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుపేదలు

### అర్హులకు మొండిచేయి చూపిస్తరా?

శంకరపట్నం, మే 8 : 'మాకు ఇండ్లు లేవు. ఎన్నో ఏండ్ల సంది కిరాయి కొంపలళ్ల ఉంటున్నం. కూలీ నాలీ చేసుకొని బతుకుతన్నం. ఇల్లడుగు జాగ ఉన్నదని ప్రజా పాలనల దరఖాస్తు చేసుకున్నం. కానీ, లిస్టులళ్ల మా పేర్లే లేవంటున్రు. మాకంటే అన్నీ మంచిగున్నోళ్ల పేర్లు వచ్చినయట. మాకెందుకు రాలేదు. అర్హులకు మొడిచేయి చూపిస్తరా..' అని శంకరపట్నం మండలం కరీంపేట్ గ్రామంలోని నిరుపేదలు నిలదీశారు. గురువారం నిరసన తెలిపారు. అర్హులైన తమకు ఇండ్లు మంజూరు చేయాలని వేడుకున్నారు. గ్రామసభలో అధికారులు అర్హుల జాబితాలో తమ పేర్లు చదివి వినిపిస్తే ఇండ్లు వస్తాయని సంతోషపడ్డామని, అయితే ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేసిన జాబితాల్లో మాత్రం తమ పేర్లు తొలగించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకంటే మెరుగైన స్థితిలో ఉన్న వారికి అర్హుల జాబితాలో చోటు కల్పించారని ఆగ్రహించారు.

### బధిరుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 8 : 2025–26 విద్యాసంవత్సరానికి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమల ఉదయ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో, ఒకటి నుంచి పదోతరగతి వరకు తెలుగు మాధ్యమంలో ప్రవేశాలు కల్పించనుండగా, 6 నుంచి 14 ఏళ్లలోపు బధిర బాల, బాలికలు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోని బాలబాలికలకు మాత్రమే ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం, పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూలు యూనిఫామ్‌తో పాటు భోజనం, విద్య ఉచితంగా అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న విజయపురికాలనీలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 9000013639 నెంబర్‌లో సంప్రదించాలని వివరించారు.



జగిత్యాల: ధరూర్ క్యాంపులో పటాకులు కాలుస్తున్న స్థానికులు



# సలాం.. సైనికా

- ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసల జల్లు
- భారత సైన్యానికి వెల్లువెత్తిన అభినందనలు
- ఉమ్మడి జిల్లాలో సంబురాలు
- న్యాయవాదుల ర్యాలీలు

వేములవాడ, మే 8: పీవోకే, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేసిన క్షిపణి దాడులపై సబ్బండవర్గాల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. పహల్గాంలో మతం అడిగి 26 మంది ఉసురు తీసిన ఉగ్రవాదుల దాడికి ప్రతీకారం తీర్చుకోవడాన్ని స్వాగతిస్తున్నారు. సైన్యం పనితీరు, పరాక్రమాలను చూసి గర్విస్తున్నామని, 'సలాం సైనికా' అంటూ అభినందనలు తెలుపుతున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలో పార్టీలకతీతంగా సంబురాలు చేసుకున్నారు. జగిత్యాల ధరూర్ క్యాంప్‌లో కాలనీవాసులు స్వీట్లు పంపిణీ చేసి పటాకులు పేల్చారు. మెట్‌పల్లిలో గంగపుత్ర సంఘం సభ్యులు జాతీయ జెండాతో కాలనీలో తిరుగుతూ 'భారత్ మాతాకీ జై' నినాదాలతో హోరెత్తించారు. అలాగే అక్కడక్కడ న్యాయవాదులు ర్యాలీలు తీశారు. కోరుట్లలో కోర్టు నుంచి కొత్త బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. జాతీయ పతాకాలు చేతబూని 'భారత్ మాతాకీ' జై నినాదాలతో హోరెత్తించారు. మానవహారంగా ఏర్పడి, పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. సిరిసిల్లలో జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి గాంధీ చౌక్ వరకు 'జై జవాన్' నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. వేములవాడలో తెలంగాణ చౌక్ నుంచి తిప్పాపూర్ తెలంగాణ తల్లి విగ్రహం వరకు న్యాయవాదులు ర్యాలీ తీసి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం అని అన్నారు. భారత్ సాంకేతిక సత్తా ఏంటో ఇవాళ ప్రపంచానికి తెలిసిందన్నారు. ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి ముష్కరులకు భారత్ సరైన సమాధానం ఇచ్చిందన్నారు. సాధారణ పౌరులకు హాని కలగకుండా కచ్చితమైన ప్రాంతాల్లో దాడులు చేయడంతో భారత్ టెక్నాలజీ శక్తి ప్రపంచానికి తెలిసిందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు కటకం జనార్ధన్, రేగుల దేవేందర్, గుడిసె సదానందం, పొత్తూరు అనిల్ కుమార్, కొడిమ్యాల పురుషోత్తం, కిశోర్‌రావు, జంగం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో ర్యాలీగా వెళ్తున్న న్యాయవాదులు